



గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్ టౌక్ అల్ మరీ. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు.

రాష్ట్రంలో 'నిఫా' ప్రభావం లేదు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం




ప్రత్యేక వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, జూలై 25: రాష్ట్రంలో నిఫా వైరస్ ప్రభావం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్పష్టం చేశారు. స్థానిక టి.నగర్, సీఐటీ నగర్, శ్రీరామ్‌పేట ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్యశిబిరాలను గురువారం మంత్రి ప్రారంభించి, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రతలు తదితర అంశాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులను గుర్తించి, వాటి నియంత్రణ, వ్యాధి నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు కారణంగా మూడేళ్లగా వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రభావం నియంత్రణలోకి వచ్చిందని తెలిపారు. గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు 10,000 వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. 2017లో రాష్ట్రంలో అధికంగా 23,294 మంది డెంగ్యూ బారిన పడగా, వారిలో 65 మంది మృతిచెందారని తెలిపారు. అంతకు ముందు 2012లో 66 మంది మృతిచెందారన్నారు. ఈ పరిస్థితులు గమనించి స్థానిక సంస్థల్లో వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని ముందస్తు చర్యలు చేపట్టిన కారణంగా డెంగ్యూ మృతులు నమోదుకావడం లేదన్నారు. ప్రస్తుతం చెన్నై, కోవై, కృష్ణగిరి, తిరుపత్తూర్, తేని, మదురై, తిరునల్వేలి, నామక్కల్, తంజావూరు తదితర జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా ఉందన్నారు. దానిని నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి 1 నుంచి బుధవారం వరకు 6,565 మందికి డెంగ్యూ సోకిందన్నారు. అలాగే, 390 మంది స్వైన్‌ఫ్లూ, 56 మందికి టైఫాయిడ్, 1,481 మందికి ర్యాట్ ఫీవర్, 1,750 మంది పచ్చకామర్ల బారిన పడ్డారని తెలిపారు. స్వైన్‌ఫ్లూ, ర్యాట్ ఫీవర్ తదితరాల కారణంగా ఎవరూ మృతిచెందలేదని, డెంగ్యూ జ్వరం సోకి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో ముగ్గురు మృతిచెందారని తెలిపారు. ప్రస్తుతం నైరుతి రుతుపవన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అలాగే, వ్యాధులు అధికమవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 476 సంచార వైద్య బృందాలు బాధిత ప్రాంతాల్లో పర్యటించి చికిత్సలందిస్తున్నారన్నారు. పట్టణాల్లోని ఒక వీధి, లేదా ఒక గ్రామంలో ముగ్గురికి వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయితే ఆ ప్రాంతంలో సత్వరం వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని జిల్లా అధికారులకు ఆదేశించామని తెలిపారు. అలాగే, దోమల నిర్మూలనకు 23,384 మంది తాత్కాలిక ఉద్యోగులతో 16,005 యంత్రాల ద్వారా దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. జ్వరం లక్షణాలున్నట్లయితే సొంతంగా చికిత్స చేసుకోకుండా సత్వరం ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిఫా వైరస్ వ్యాప్తి అరికట్టేలా కేరళ నుంచి వస్తున్న వాహనాలు, ప్రయాణికులను పరీక్షల అనంతరమే రాష్ట్రంలోని అనుమతిస్తున్నామని తెలిపారు. తమిళనాడు-కేరళ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలైన నందిగని, చూలడి, తోలూర్, నంబియార్‌కున్ను, పాట్టావాయల్ ప్రాంతాల్లో శాశ్వత శిబిరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

రైల్వే టెర్మినల్‌గా పెరంబూర్


పెరంబూర్, జూలై 25: స్థానిక పెరంబూర్ రైల్వే స్టేషన్‌ను కొత్త టెర్మినల్‌గా మార్చేందుకు సమగ్రమైన ప్రాజెక్ట్ పనులు ప్రారంభించినట్లు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త రైలు మార్గం, రైలు మార్గాల విస్తరణ, జంట రైలు మార్గం తదితరాలకు కేంద్ర ప్రభుత్వం రూ.6,362 కోట్లు కేటాయించిందన్నారు. రైల్వే పథకాల అమలుకు సంబంధించి భూసేకరణలో జాప్యం జరుగుతోందని, ఈ విషయమై రాష్ట్రప్రభుత్వంతో చర్చించనున్నామని తెలిపారు. ప్రస్తుతం రూ.732 కోట్లతో ఎగ్మూర్ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయని, మదురై, రామేశ్వరం, కన్నియాకుమారి తదితర రైల్వేస్టేషన్ల పునరుద్ధరణ పనులు మరో మూడేళ్లలో పూర్తవుతాయని తెలిపారు. పాంబన్ వంతెన పనులు పూర్తయి ట్రయల్ రన్ నిర్వహించామని సెప్టెంబరులో ఈ వంతెన మీదుగా రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశముందన్నారు. చెన్నై బీచ్-ఎగ్మూర్ 4వ రైలు మార్గం పనులు సెప్టెంబరు నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కిలంబాక్కం రైల్వేస్టేషన్ పనులు వచ్చే ఏడాది మార్చిలో పూర్తవుతాయని తెలిపారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో రైళ్ల సంఖ్య కూడా పెంచాల్సి ఉందని, అందువల్ల ప్రస్తుతమున్న టెర్మినల్స్ చాలవన్నారు. నగరంలో ఇప్పటికే చెన్నై సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం టెర్మినల్లున్నాయని, ఇప్పుడు పెరంబూరు కూడా చేరుతున్నందున టెర్మినళ్ల సంఖ్య నాలుగుకు చేరుతుందన్నారు. పెరంబూర్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు సర్వే చేపట్టామని, ఈ పనులు నెలలో ముగుస్తాయని తెలిపారు. నిజానికి విల్లివాక్కంను నాలుగో టెర్మినల్‌గా చేయాలని భావించినా, అక్కడ తగినంత స్థలం లేకపోవడంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామన్నారు. పెరంబూర్‌లో తగినంత స్థలం ఉండడంతో, ఆ ప్రాంతంలో 4వ టెర్మినల్ ఏర్పాటుచేయనున్నామన్నారు. ప్రస్తుతం కొత్త టెర్మినల్‌కు సంబంధించ సమగ్రమైన రిపోర్ట్ తయారవుతోందని, రైల్వే బోర్డు అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. 2028లోగా కొత్త రైల్వే టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా పెరంబూర్-అంబత్తూర్ మధ్య 5వ, 6వ రైలు మార్గాలను కూడా ఏర్పాటుచేయనున్నట్లు దక్షిణ రైల్వే జీఎం తెలిపారు.



పెరంబూర్ రైల్వే స్టేషన్

నకిలీ ప్రొఫెసర్ల వ్యవహారం ...
అన్నా వర్సిటీ నివేదిక కోరిన గవర్నర్

ప్యారీస్, జూలై 25: ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో నకిలీ ప్రొఫెసర్ల నియామకంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నావర్సిటీని ఆదేశించారు. తప్పుడు ఆధార్ నెంబరు సమర్పించి ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేసిన 189 మంది ప్రొఫెసర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా అన్నా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆర్.సెల్వరాజ్‌ను ఆదేశించారు. 2023-24వ విద్యా సంవత్సరంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు గుర్తింపు కేటాయించడంలో అన్నా వర్సిటీలో భారీస్థాయిలో అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. అర్హత లేని వందలాది కళాశాలలకు అడ్డగోలుగా గుర్తింపు మంజూరు చేయడంతోపాటు, 353 మంది ప్రొఫెసర్లను ఒకే సమయంలో పలు కళాశాలల్లో ఫుల్ టైం ప్రొఫెసర్లుగా పనిచేసేందుకు నియమించినట్లు ఫిర్యాదులొచ్చాయి. అదే విధంగా, 972 మంది ఫుల్ టైం ప్రొఫెసర్ పోస్టులను అడ్డగోలుగా భర్తీచేశారని, అందువల్ల ఈ అవినీతిపై 224 కళాశాలల నిర్వాహకులు, 353 మంది ప్రొఫెసర్లను విచారించాలని పలువురు విద్యావేత్తలు డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ మోసంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు, ముఖ్యమంత్రి స్టాలిన్, విశ్వవిద్యాలయాల సంచాలకులు, గవర్నర్ ఆర్ఎన్ రవి, ఉన్నత విద్యా శాఖ మంత్రి పొన్ముడిలకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్ నకిలీ ప్రొఫెసర్ల నియామకంపై నివేదిక ఇవ్వాలని అన్నా వర్సిటీ వైస్ ఛాన్సలర్ సెల్వరాజ్‌కు ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి...!

● అన్నాడీఎంకే కార్యకర్తలకు ఈపీఎస్ పిలుపు

పెరంబూర్, జూలై 25: స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని అన్నాడీఎంకే శ్రేణులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘోరపరాజయానికి గల కారణాలపై నియోజకవర్గాల వారీగా పళనిస్వామి చర్చిస్తున్నారు. ఈ సమావేశాల్లో భాగంగా గురువారం తెన్‌కాశి, ఈరోడ్ నియోజవర్గాల నేతలతో ఈపీఎస్ సమావేశమయ్యారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెన్‌కాశి నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిని ముందుంచి ప్రచారం చేయలేదని, కూటమి కూడా బలంగా లేదన్నారు. అనంతరం పళనిస్వామి మాట్లాడుతూ... అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలందరూ సమష్టిగా త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పాటుకానుందని ఈపీఎస్ తెలియజేశారు. సమావేశంలో పార్టీ ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు నత్తం విశ్వనాధన్, కేపీ మునుస్వామి, ఎస్పీ వేలుమణి, దిండుగల్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ధర్నా

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని డీఎంకే నిర్ణయించింది. కేంద్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఈ నెల 27న జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఇప్పటికే డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోట్ల శనివారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు డీఎంకే పిలుపునిచ్చింది. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కలిగిన తమిళనాడు సహా బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు ఈ బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ఆరోపించిన డీఎంకే.. మెట్రోరైలు ప్రాజెక్ట్‌కు, రాష్ట్రం నిరంతరం ఎదుర్కొంటున్న ప్రకృతి విపత్తుల నివారణ నిధులపై ముఖ్యమంత్రి చేసిన వినతులను కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించింది. అందుకే కేంద్ర వైఖరికి నిరసనగా శనివారం ఉదయం 10 గంటలకు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ధర్నాలకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని డీఎంకే పిలుపునిచ్చింది.

బంగ్లాదేశ్ నుంచి మరో 42 మంది విద్యార్థులు

● విమానాశ్రయంలో స్వాగతం పలికిన మంత్రి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సెంజి మస్తాన్, విద్యార్థులు

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ నుంచి గురువారం ఉదయం రాష్ట్రానికి చెందిన మరో 42మంది విద్యార్థులు విమానంలో నగరానికి చేరుకున్నారు. వీరికి ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ ఘనస్వాగతం పలికారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల ఉద్యమం తీవ్రరూపం దాల్చటంతో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ దేశంలో ఉన్నత విద్య, ఉపాధి కోసం వెళ్ళిన తమిళులను స్వస్థలానికి చేర్చే కార్యక్రమాలను ముమ్మరం చేసింది. మంత్రి సెంజి మస్తాన్ భారత రాయబార కార్యాలయం అధికారుల ద్వారా ప్రయత్నించడంతో దశలవారీగా విద్యార్థులు స్వస్థలాలకు తిరిగి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ నుంచి నాలుగో విడతగా 42 మంది విద్యార్థులు కోల్‌కతా, గౌహతి విమానాల్లో నగరానికి చేరుకున్నారు. వీరంతా కృష్ణగిరి, కడలూరు, ధర్మపురి, తంజావూరు, సేలం, వేలూరు, రాణిపేట, మదురై, విరుదునగర్, ఈరోడ్, విల్లుపురం, తెన్‌కాశి, తిరువణ్ణామలై, తూత్తుకుడి, మైలాడుదురై, తిరువళ్లూరు, కాంచీపురం, చెన్నై జిల్లాలకు చెందినవారు. ఈ విద్యార్థులకు విమానాశ్రయం వద్ద మంత్రి సెంజి మస్తాన్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ చిచ్చు ఆ దేశమంతటా వ్యాపించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, ఆ పరిస్థితుల్లో ఆ దేశంలో ఉన్న రాష్ట్రానికి చెందిన విద్యార్థులను వారి అనుమతి తీసుకుని స్వదేశానికి తరలించే కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటికే మూడు విడతలుగా విద్యార్థులను స్వస్థలాలకు చేర్చామని, తాజాగా నాలుగో విడతగా 42 మంది విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చి, వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి ఇప్పటి వరకూ మొత్తం 208 మంది విద్యార్థులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చినట్లు మంత్రి సెంజి మస్తాన్ వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు ప్రవాస తమిళుల సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ విద్యార్థులందరికీ భోజన సదుపాయం కల్పించి, విమాన ఛార్జీలను కూడా సమకూర్చినట్లు ఆయన చెప్పారు.

చట్టసభలపై యువతకు అవగాహన ఉండాలి

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

● చెన్నైలో యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ ప్రాంతీయ సదస్సు



సదస్సులో వెంకయ్య నాయుడు, అన్బుమణి తదితరులు

అడయార్, జూలై 25: చట్టసభల్లో నియమాలు, నిర్వహణ పట్ల యువత అవగాహన కలిగి ఉండడాలని, చట్టసభలపై యువతకు గౌరవం పెరిగేలా ప్రజాప్రతినిధులు నడుచుకోవాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. స్థానిక ఎగ్మోర్ మ్యూజియంలో గురువారం సీఐఐ ఆధ్వర్యంలో 'రీజినల్ రౌండ్ ఆఫ్ యంగ్ ఇండియన్స్ పార్లమెంట్' సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్య, గౌరవ అతిథిగా పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సామాజిక బాధ్యత, నైతిక విలువలతో కూడిన కొత్తతరం నాయకులను ప్రోత్సహించాలన్న దృక్పథంలో ఈ ప్రాంతీయ సదస్సు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. 'యంగ్ ఇండియన్స్ పార్లమెంట్' అనేది ఒక ఆకర్షణీయమైన చొరవలాంటిదన్నారు. సమర్థవంతమైన పాలన కోసం చట్టసభల్లో ఆలోచనలు పంచుకోవడం, చర్చించడం ఎంతో అవసరమన్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య వ్యవస్థలో భారతీయ ప్రజాస్వామ్యానికి ఎంతో ప్రత్యేకత ఉందని, అందులోనూ మన చట్టసభలు ఎంతో విశిష్టమైనవని వెంకయ్య అన్నారు. భావితరాలను సామాజిక బాధ్యత, నైతిక ప్రవర్తన కలిగిన కొత్తతరంనాయకులుగా తయారు చేసే సంకల్పంతో చేపట్టిన కార్యక్రమాన్ని వెంకయ్యనాయుడు అభినందించారు. సమర్థవంతమైన పాలన కోసం చట్టసభల్లో ఆరోగ్యకరమైన వాతావరణంలో ఆలోచనల మార్పిడి, సమగ్రమైన చర్చ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఇప్పటికీ అటల్ బిహారీ వాజ్‌పేయి, పిలూ మోడీ, హీరేన్ ముఖర్జీ, మినూ మసానీ, జ్యోతిర్మయి బసు, భూపేష్ గుప్తా వంటి అనేకమంది ప్రముఖ పార్లమెంటేరియన్లను గుర్తుంచుకుంటున్నామన్నారు. వారు ప్రాతినిధ్యం వహించిన పార్టీతో సంబంధం లేకుండా, తమ ప్రవర్తన, నైతిక విలువలతో కూడిన ఆదర్శవంతమైన నేతలుగా ఉన్నారని గుర్తు చేశారు. ఇలాంటి వారంతా ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం, గౌరవాన్ని పెంపొందించారని, నవసమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం పెరిగినప్పుడు ఈ పరిస్థితిలో స్పష్టమైన మార్పు వస్తుందన్న వెంకయ్యనాయుడు ఆ దిశలో యువత సంసిద్ధులు కావాలని ఆకాంక్షించారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా డీఎండీకే ధర్నా

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల పెంపు, రేషన్‌షాపుల్లో పప్పు, పామాలిన్ సక్రమంగా పంపిణీ చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తూ డీఎండీకే ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా, రాస్తారోకో తదితర ఆందోళనలు నిర్వహించారు. ఆవడి వద్ద డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత సారథ్యంలో జరిగిన ధర్నాలో సుమారు 500 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెన్నై కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ డిప్యూటీ కార్యదర్శి ఎల్కే. సుదీష్ నాయకత్వంలో జరిగిన ధర్నాలో నేతలు ఆనందన్, సూర్యా, ప్రభాకరన్, మారన్, సెందిల్‌కుమార్, పళని, వేల్మురుగన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

సమాచార దృశ్యిని

నేడు సప్లిమెంటరీ ఫలితాల విడుదల

ఐసిఎఫ్, జూలై 25: గత మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు ఈ నెల 26,30,31వ తేదీల్లో విడుదల కానున్నాయి. ప్లస్ టూ ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు, టెన్త్ ఫలితాలు 30వ తేది మధ్యాహ్నం 2 గంటలు, ప్లస్ వన్ ఫలితాలు 31వ తేది మధ్యాహ్నం 2 గంటలకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల కానున్నాయి. జవాబుపత్రాల నకళ్లు, రీ టోటల్ కోసం ప్లస్ టూ విద్యార్థులు ఈ నెల 29,30 తేదీల్లోను, టెన్త్, ప్లస్ వన్ విద్యార్థులు ఆగస్టు 1,2 తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా జిల్లాల ప్రధాన విద్యాధికారుల కార్యాలయాలకు నేరుగా వెళ్లి కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నేడు అమ్మవారి ఆలయాల్లో ఆడి ఉత్సవాలు

ఐసిఎఫ్, జూలై 25: స్థానిక అరుంబాక్కం అమ్మన్ ఆలయాల్లో శుక్రవారం నుంచి ఆడి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బాల వినాయక నగర్‌లో ని బాల నాగాత్తమ్మన్ 34వ వార్షిక ఆడి ఉత్సవాలు ఉదయం ప్రారంభం కానున్నాయి. 8 గంటలకు 108 బిందెలతో అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. వరుసగా మూడు రోజులు ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు జరుగనున్నాయి. పెరుమాళ్ ఆలయం వెనుక వైపున్న నాగాత్తమ్మ ఆలయంలో 21వ వార్షిక ఉత్సవాలు మూడు రోజులు నిర్వహించనున్నారు.

రామేశ్వరానికి 50 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, జూలై 25: ఆడి అమావాస్యను పురస్కరించుకొని ఆగస్టు 3వ తేది చెన్నై, ఇతర ప్రాంతాల నుంచి రామేశ్వరానికి 50 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ అధికారులు తెలిపారు. ఆగస్టు 4వ తేది ఆడి అమావాస్య రోజు పూర్వీకులకు తర్పణాలు వదలడానికి రామేశ్వరానికి ఎక్కువ మంది వస్తుంటారు. వారి సౌకర్యార్థం సేలం, కోయంబత్తూర్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

నేటినుంచి అంధుల వాలీబాల్ పోటీలు

ఐసిఎఫ్, జూలై 25: అంధుల వాలీబాల్ పోటీలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. తమిళనాడు అంధుల వాలీబాల్ సంఘం, సెయింట్ జోసఫ్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా 9వ వార్షిక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను సెమ్మంజేరి కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 21 జట్లు పాల్గొంటున్నాయి. ఉదయం 10 గంటలకు ఈ పోటీలను షోలింగనల్లూర్ ఎమ్మెల్యే అరవింద్ రమేష్ ప్రారంభించనున్నారు.

7 నుంచి వస్తువుల ప్రదర్శన

ఐసిఎఫ్, జూలై 25: కాంచీపురం జిల్లా తిరుముడివాక్కంలో చిన్న వృత్తుల అభివృద్ధి సంస్థ (సిడ్కో) ఆధ్వర్యంలో వస్తువుల ప్రదర్శన ఆగస్టు 7న ప్రారంభం కానుంది. సిడ్కో ఎస్టేట్ సమీపంలో 1,000కి పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థలు పనిచేస్తున్నాయి. వాటిలో ఎక్కువగా మోటారు విడిభాగాలు తయారుచేస్తున్నారు. తిరుముడివాక్కం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమాఖ్య, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సిడ్కో ఎస్టేట్ ప్రాంగణంలో వచ్చే నెల 7,8,9 తేదీల్లో వస్తువుల ఎగ్జిబిషన్ ఏర్పాటుకానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు కారు, మోటారు సైకిల్ విడిభాగాలు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఆగస్టు 27న వేతన ఒప్పంద చర్చలు

ఐసిఎఫ్, జూలై 25: ప్రభుత్వ రవాణా సంస్థ ఉద్యోగుల 15వ వేతన ఒప్పంద చర్చలు ఆగస్టు 27వ తేది జరుగనున్నాయి. 14వ వేతన ఒప్పందం ముగిసి ఏడాదికి పైగా అవుతోంది. కార్మిక సంఘాలు ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో, ఒప్పందాల చర్చలు ఈ నెల 8వ తేది జరిగాయి. కార్మికుల ప్రత్యేక జాయింట్ కమిషనర్ సమక్షంలో జరిగిన ఈ చర్చలు విఫలం కావడంతో, మళ్లీ ఆగస్టు 27వ తేది చర్చలు జరుగుతాయని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, జూలై 25: తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 1,200 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. ఈ కేంద్రంలోని మొదటి స్టేషన్‌లోని మూడు యూనిట్లలో తలా 210 మెగావాట్లు, రెండో స్టేషన్‌లోని రెండు యూనిట్లలో తలా 600 మెగావాట్లు మొత్తం 1,830 మెగావాట్లు విద్యుదుత్పత్తి జరుగుతోంది. రెండో స్టేషన్‌లో ఉన్న మొదటి యూనిట్ గత వారం సాంకేతిక లోపం కారణంగా 600 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోగా, రెండో యూనిట్‌లో బుధవారం బాయిలర్ ట్యూబ్ పంచర్ కారణంగా మరో 600 మెగావాట్ల ఉత్పత్తి ఆగిపోయింది. ప్రస్తుతం మరమ్మతుపనులు చేపట్టినట్లు ఇంజనీర్లు తెలిపారు.

విద్యుత్ సాధనాల తరలింపు ఛార్జీల తగ్గింపు

ఐసిఎఫ్, జూలై 25: విద్యుత్ సాధనాల ఛార్జీలను రాష్ట్ర విద్యుత్ బోర్డు తగ్గించింది. విద్యుత్ సాధనాలను ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించాలనుకొనే వినియోగదారులు అందుకయ్యే ఖర్చు రుసుముగా చెల్లించాలి. ఆ ప్రకారం, దరఖాస్తు చేసుకున్న వారికి 22 శాతం నిర్వహణ, పర్యవేక్షణ రుసుము ఈబీ వసూలు చేస్తోంది. ఈ ఛార్జీలను ఈ నెల 8వ తేది నుంచి 5 శాతం తగ్గిస్తూ విద్యుత్ క్రమబద్ధీకరణ సంస్థ ఉత్తర్వులు జారీచేసింది.

కిలో క్యారట్ రూ.120

ఐసిఎఫ్, జూలై 25: వర్షాల కారణంగా స్థానిక కోయంబేడు మార్కెట్లో కిలో క్యారట్ రూ.120కు విక్రయమవుతోంది. వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ఈ మార్కెట్‌కు కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ఊటీ నుంచి ప్రతిరోజు 2,000 బస్తాల క్యారట్ దిగుమతవుతుండగా, అక్కడ కురుస్తున్న వర్షాల కారణంగా ప్రస్తుతం 1,000 బస్తాలు మాత్రమే వస్తున్నాయి. ఈ కారణంగా కిలో రూ.120కు విక్రయిస్తున్నారు. చిల్లర వ్యాపారులు కిలో రూ.180 వరకు విక్రయిస్తున్నారు.

పేరూర్‌లో నిర్లవణీకరణ కేంద్రం

ఐసిఎఫ్, జూలై 25: మహాబలిపురం సమీపంలోని నెమ్మేలి పేరూర్‌లో మూడవ నిర్లవణీకరణ కేంద్రం ఏర్పాటుకానుంది. నగర తాగునీటి అవసరాలను పూర్తిచేసేలా 2003-04లో సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే పథకం అమలుచేశారు. తిరువళ్లూర్ జిల్లా మీంజూరు కాట్టుపల్లి, చెంగల్పట్టు జిల్లా ఈసీఆర్ రోడ్డు నెమ్మేలి, సూలేరికాడు అనే రెండు ప్రాంతాల్లో రోజుకు తలా 10 కోట్ల లీటర్ల సామర్థ్యం కలిగిన నిర్లవణీకరణ ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, మహాబలిపురం సమీపంలోని నెమ్మేలి పేరూర్‌లో 85.51 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,276.44 కోట్లతో మూడవ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నారు.

దేశ పౌర బాధ్యతల్లో పన్ను చెల్లింపు ఒకటి

ఐటీ సహాయ కమిషనర్ అమ్ము ● హిందూ కాలేజీలో ఆదాయపు పన్ను దినోత్సవం

అడయార్, జూలై 25: భారతీయ పౌర బాధ్యతల్లో పన్ను చెల్లించడం ఒక ముఖ్యమైన అంశమని ఆదాయపన్ను శాఖ సహాయ కమిషనర్ అమ్ము పేర్కొన్నారు. పట్టాభిరాంలోని ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాలలో బుధవారం ఇన్‌కమ్ టాక్స్ డేను పురస్కరించుకుని కాలేజీలోని వివిధ వాణిజ్య విభాగాలు సంయుక్తంగా విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. దీనికి అమ్ము ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ, ఆదాయపు పన్నును 1860లో సర్ జేమ్స్ విల్సన్ స్థాపించిన జ్ఞాపకార్థంగా ఇన్‌కమ్ ట్యాక్స్ డే ప్రతి యేటా జూలై 24వ తేదీ జరుపుకుంటున్నారని తెలిపారు. ఇది భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా అభివర్ణించారు. అంతకుముందు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కల్వికరసి ముఖ్య అతిథిని పరిచయం చేయడంతోపాటు ఆదాయపు పన్ను దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కాలేజీ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజేంద్ర నాయుడు పన్నుల ప్రాముఖ్యతను, భారతీయ పన్నుల సంక్షిప్త చరిత్రను తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు దాదాపు 400 మందికిపైగా పాల్గొన్నారు. అలాగే, విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కాలేజీ సెక్రటరీ ఎం.వేంకటేశ పెరుమాళ్ అభినందించారు.


ముఖ్యఅతిథి చేతుల మీదుగా విజేతకు నగదు బహుమతి ప్రదానం

2న పుదుచ్చేరి అసెంబ్లీ బడ్జెట్

● స్పీకర్ ఏంబలం సెల్వం

పుదుచ్చేరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి మధ్యంతర బడ్జెట్ ఆగస్టు 2వ తేది ఆర్థిక శాఖ కూడా నిర్వహించే ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి అసెంబ్లీలో ప్రవేశపెడతారని స్పీకర్ ఏంబలం సెల్వం పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ... 15వ పుదుచ్చేరి అసెంబ్లీ 5వ సమావేశం ఈ నెల 31న గవర్నర్ రాధాకృష్ణన్ ప్రసంగంతో ప్రారంభమవుతుందని తెలిపారు. ఆగస్టు 1న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుందన్నారు. మరుసటిరోజైన 2వ తేది ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి రంగస్వామి బడ్జెట్ ప్రవేశపెడతారని, సమావేశాలు ఎన్ని రోజులన్నదానిపై బీఏసీ నిర్ణయిస్తుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రతి ఏటా మార్చిలో బడ్జెట్ దాఖలుచేస్తుంటారని, ఈ ఏడాది మార్చిలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టలేదన్నారు. అందుకు బదులుగా ప్రభుత్వ ఐదు నెలల ఖర్చుల కోసం రూ.4,634 కోట్లకు తాత్కాలిక బడ్జెట్ పెట్టిందని, లోక్‌సభ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రణాళిక కమిటీ సమావేశం గత నెల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షతన జరిగిందని, ఈ సమావేశంలో రూ.12,700 కోట్ల ప్రణాళిక నివేదిక తయారుచేయడం జరిగిందన్నారు. దీనికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లభించిందని స్పీకర్ తెలిపారు.

మూడో రోజూ తగ్గిన బంగారం ధర

పెరంబూర్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో బంగారం దిగుమతి సుంకం తగ్గించడంతో, వాటి ధర మూడో రోజు కూడా తగ్గింది. నగరంలో గురువారం 22 క్యారట్ల బంగారు ఆభరణం గ్రాముకు రూ.60కి తగ్గి రూ.6,430గా ఉంది. అలాగే, ఒక సవరం రూ.51,440 ఉంది. ఈ నెల 17వ తేది బంగారం సవరం రూ.55,360 ధర ఉండగా, 22వ తేది రూ.54,600లకు తగ్గింది. 23వ తేది కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంతో కొన్ని నిమిషాల్లో గ్రాముకు రూ.275 తగ్గి, రూ.6,550కి విక్రయం కాగా, సవరంపై రూ.2,220 తగ్గి రూ.52,440గా ఉంది. అలాగే, వెండి గ్రాముకు రూ.3.10 తగ్గి రూ.92.50కి విక్రయమైంది. ఈ నేపథ్యంలో, మూడో రోజు గురువారం బంగారం ధరలు గ్రాము రూ.60 తగ్గి రూ.6,430, ఒక సవరంపై రూ.480 తగ్గి రూ.51,440కు విక్రయమైంది. అలాగే, వెండి ఒక గ్రాము రూ.3 తగ్గి రూ.89కి విక్రమవుతోంది. బంగారం, వెండి ధరలు తగ్గడంతో గురువారం కూడా జ్యువెలరీ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

నెలకు రూ.6,000 వేతనం ఎలా నిర్ణయిస్తారు...?

● పాఠశాల విద్యాశాఖకు హైకోర్టు ప్రశ్న

పెరంబూర్, జూలై 25: బోధనేతర సిబ్బందికి నెలకు రూ.6,000 వేతనం ఎలా నిర్ణయిస్తారని పాఠశాల విద్యాశాఖను హైకోర్టు మదురై బెంచ్ ప్రశ్నించింది. పాఠశాల విద్యాశాఖలో బోధనేతర సిబ్బందికి రూ.6 వేల వేతనం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయస్థానం... బోధనేతర సిబ్బందికి నెలకు రూ.6 వేల వేతనం ఎలా నిర్ణయిస్తారు? ప్రస్తుత నిత్యావసర సరుకుల ధరలను పరిగణలోకి తీసుకున్నారా? కుటుంబానికి ఒక రోజుకు రూ.200 సరిపోతుందా? ఇలాంటి జీవోలు ఎలా విడుదల విడుదల చేస్తారు? అని ప్రశ్నిస్తూ, ఈ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేశారు.

ఓరల్ హెల్త్ చెకప్‌కు మొబైల్ యాప్‌లను వినియోగించాలి

● డాక్టర్ అశోక్ ధోబ్లే

అడయార్, జూలై 25: ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేసిన మొబైల్ యాప్‌లను ప్రజల ఓరల్ హెల్త్ చెకప్‌ల కోసం వినియోగించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ హానరీ సెక్రటరీ జనరల్ డాక్టర్ అశోక్ ధూబ్లే అభిప్రాయపడ్డారు. నగరంలోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ సెకండరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గురువారం జానకి ఎంజీఆర్ ఎండోమెంట్ స్మారక ఉపన్యాసాలు జరిగాయి. ఇందులో డాక్టర్ అశోక్ ధోబ్లే పాల్గొని ప్రసంగిస్తూ, డెంటల్ మొబైల్ క్లినిక్‌లపై దంత వైద్యులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఏఐలతో అనుసంధానించిన మొబైల్ యాప్‌ను ప్రజల నోటి ఆరోగ్య పరిరక్షణకు ఉయోగించాలన్నారు. దేశంలో 3.5 లక్షల మంది దంత వైద్యులు ఉండగా, వారిలో ఎక్కువ మంది అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఉంటున్నారన్నారు. పొగాకు వినియోగంతో ప్రతి రోజూ ఏడు నుంచి ఎనిమిది నోటి కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. ఇందులో శ్రీ రామచంద్ర డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్ డీన్ డాక్టర్ హెచ్.తమిళ్ సెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

'జీరో ఈజ్ ది హీరో' - నవీన్స్ 35వ వార్షికోత్సవం

అడయార్, జూలై 25: 'జీరో ఈజ్ ది హీరో' పేరుతో ప్రముఖ భవన నిర్మాణ కంపెనీ నవీన్స్ తన 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా గృహ కొనుగోలుదారులకు తొలి 15 నెలల వరకు జీరో ఈఎంఐ సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ విశ్వజిత్ కుమార్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని అంత్యత విశ్వసనీయమైన గృహ నిర్మాణ బిల్డర్‌గా, రియల్ ఎస్టేట్ డెవలపర్‌గా ప్రజల్లో విశ్వాసం చూరగొన్నామన్నారు. తమ 35 యేళ్ళ ట్రాక్ రికార్డు తమ కంపెనీ నిబద్ధత వివరిస్తుందన్నారు. జీరో ప్రాజెక్టు జాప్యాలు, జీరో క్వాలిటీ సమస్యలు, జీరో స్ట్రక్చరల్ డిఫెక్ట్స్, జీరో టైటిల్ ప్రాబ్లమ్స్, జీరో డివియేషన్స్, జీరో కస్టమర్ వివాదాలు, గ్రీన్ ఫ్యూచర్‌లో జీరో కాంప్రమైజ్ ఇలా ప్రతి అంశంలో మంచి పేరు పొందినట్టు వివరించారు.

చెన్నై తిరిగొచ్చిన అండమాన్ విమానం

పెరంబూర్, జూలై 25: నగరం నుంచి అండమాన్ బయల్దేరిన విమానం మళ్లీ నగరానికి తిరిగొచ్చింది. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి గురువారం ఉదయం 190 మంది ప్రయాణికులతో ఓ విమానం అండమాన్‌కు వెళ్లింది. కానీ, అండమాన్‌లో భారీవర్షాలు, ఈదురుగాలులతో కూడిన వాతావరణం కారణంగా విమానం ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో, చెన్నై విమానాశ్రయ అధికారుల అనుమతితో, ఆ విమానం మళ్లీ నగరానికి తిరిగి చేరుకుంది. ప్రయాణికులు ప్రత్యేక వసతి కల్పించామని, అండమాన్‌లో వాతావరణం అనుకూలించాక విమానం బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.


ఢిల్లీలో గురువారం సాయంత్రం కేంద్ర జలశక్తి శాఖ మంత్రులు సీఆర్ పాటిల్, వి.సోమన్నా, రాజ్‌భూషణ్ చౌదరిని కలిసి రాష్ట్రానికి చెందిన జలవివాదాలను పరిష్కరించాలని, నదుల, జలాశయాలను మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పిస్తున్న రాష్ట్ర నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్.

త్వరలో టాస్మాక్ దుకాణాల్లో రసీదులు

● మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్, జూలై 25: రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో రసీదులు ఇచ్చే ప్రక్రియ మరో రెండు నెలల్లో అమలుకు రానుందని ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామి తెలిపారు. టాస్మాక్ దుకాణాల్లో ఖాళీ మద్యం బాటిళ్ల తిరిగి పొందడంపై ప్రతిపక్ష నేత ఎడప్పాడి ఆరోపణలకు గురువారం మంత్రి వివరణ ఇచ్చారు. ఖాళీ బాటిళ్ల తిరిగి తీసుకొనే విధానంలో హైకోర్టు పలు సూచనలు చేసిందన్నారు. అందువల్ల, ఖాళీ సీసాలు తిరిగి పొందే ఒప్పందాలకు సంబంధించిన టెండర్లను టాస్మాక్ సంస్థ రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాల్లో చిల్లర విక్రయాలకు సంబంధించి డిజిటల్ విధానంలో నగదు వసూలుచేస్తున్నామని తెలిపారు. అలాగే, మద్యం దుకాణాల్లో కొనుగోళ్లకు సంబంధించిన రసీదులు ఇచ్చేందుకు అవసరమైన యంత్రాలు కొనుగోలు చేసే చర్యలు చేపట్టామని, మరో రెండు నెలల్లో ఈ విధానం అమలుకు వస్తుందని మంత్రి తెలిపారు.

పశువుల కొట్టాలకు స్థల సేకరణ

ఐసిఎఫ్, జూలై 25: మండలాల వారీగా పశువుల కొట్టాలు ఏర్పాటుచేసేందుకు కార్పొరేషన్ స్థలం సేకరిస్తోంది. రహదారులపై వాహన రాకపోలకు అంతరాయం కలిగించేలా తిరిగే పశువులను బంధించి వాటి యజమానులకు జరిమానా విధిస్తున్నారు. బుధవారం తేనాంపేట మండలంలో 12 పశువులు స్వాధీనం చేసుకొని వాటి యజమానులకు తలా రూ.5,000 వంతున జరిమానా విధించారు. రెండో సారి పట్టుబడితే జరిమానా రెండింతలు వసూలుచేస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, నగరంలో తిరిగే పశువులను ఒకే స్థలంలో ఉంచి పర్యవేక్షించేలా ప్రభుత్వ స్థలాల్లో కొట్టాలు ఏర్పాటుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. దీని కోసం ఖాళీ స్థలాల సేకరణ పనులను చేపట్టింది.

ఎన్ఏసీఎఫ్ఎస్ కోశాధికారిగా ఎం.కృష్ణ ఎన్నిక


సత్యనారాయణన్, ఎస్.కన్నన్, కరణ్ తక్కర్, ఎం.కృష్ణ

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్స్ (ఎన్ఏసీఎఫ్ఎస్) చెన్నై విభాగానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. రెండేళ్లపాటు ఈ కార్యవర్గం కొనసాగనుంది. ఎన్ఏసీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా శాన్‌కో ట్రాన్స్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా ట్రైవే సీఎఫ్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.కన్నన్, కార్యదర్శిగా వైకింగ్ వేర్‌హౌసింగ్ ప్రతినిధి కరణ్ తక్కర్, కోశాధికారిగా కెన్సెస్ కంటైనర్ టెర్మినల్ లిమిటెడ్ ప్రతినిధి ఎం.కృష్ణ ఎన్నికయ్యారు. అదే విధంగా వి.రమేష్, ఎస్.ప్రవీణ్, వి.భాస్కరన్, శ్రీకాంత్ మాధవ రావు, ఎస్.నరసింహన్, బాల్‌ముకుంద విశ్వకర్మ, టి.మనోహరన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గమంతా వచ్చే నెల బాధ్యతలు స్వీకరిస్తుందని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

శరవేగంగా తచ్చూరు ఆరు లేన్ల రహదారి నిర్మాణం

● పరిశీలించిన మంత్రి ఏవీ వేలు

అడయార్, జూలై 25: నగర శివారు ప్రాంతమైన తచ్చూరు నుంచి చిత్తూరు వరకు ఆరు లేన్ల రహదారి నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి ఏవీ వేలు పరిశీలించారు. నగర సమీపంలోని కాట్టుపల్లి వద్ద ఆదాని హార్బర్‌ను పలు ప్రాంతాలకు అనుసంధానిస్తూ ఈ రహదారిని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర ప్రజా పనుల శాఖామంత్రి ఏవీ వేలు పరిశీలించారు. అనంతరం చెన్నై ఔటర్ రింగ్ రోడ్డు, చెన్నై బోర్డర్ రహదారి పనులను కూడా ఆయన పరిశీలించారు. మంత్రి వేలు వెంట ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మీంజూరు డీఎంకే నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

ఎల్టీటీఈపై నిషేధం పొడిగింపు... ఢిల్లీ ట్రిబ్యునల్‌లో వైగో పిటిషన్

ప్యారీస్, జూలై 25: ఎల్టీటీఈ సంస్థపై విధించిన నిషేధాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ ట్రిబ్యునల్‌లో ఎండీఎంకే నేత వైగో పిటిషన్ దాఖలుచేశారు. శ్రీలంకకు చెందిన ఎల్టీటీఈ ఉగ్రవాద సంస్థను భారత దేశంలో నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన ఉత్తర్వులను ప్రతి ఐదేళ్లకు ఒకసారి కేంద్ర హోంశాఖ పొడిగిస్తుంది. ఈ నిషేధ ఉత్తర్వుల మేరకు ఢిల్లీలోని ట్రిబ్యునల్ విచారణ జరిపేందుకు నిర్ణయించింది. ఈ విచారణకు తనను కూడా ఒక పార్టీగా పరిగణించాలని కోరుతూ పిటిషన్ వేశారు. కేంద్రప్రభుత్వం ఎల్టీటీఈని నిషేధించినందుకు ఎలాంటి ఆధారాలు లేవని, నిషేధ ఉత్తర్వులు రద్దు చేయాలంటూ వైగో పిటిషన్‌లో సూచించారు. ఈ పిటిషన్ ఆగస్టు 7న విచారణకు రానుంది.

రూ.4.5 కోట్ల జీఎస్టీ బకాయి సాకుతో ఆగిన గృహిణి రూ.1.000 భృతి

ప్యారీస్, జూలై 25: ఓ కార్మికుడి భార్యకు రాష్ట్రప్రభుత్వం కల్పించిన రూ.1,000 సహాయాన్ని రూ.4.5 కోట్ల జీఎస్టీ బకాయి ఉందన్న కారణంగా బ్యాంక్ నిలిపివేసింది. తిరుపత్తూర్ జిల్లా అంబూరుకు చెందిన నియాస్ అహ్మద్ భార్య మొబీనా బస్రూల్ రెహ్మాన్‌కు రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా కలైంజర్ మగళీర్ ఉరుమై నిధి పథకంలో రూ.1,000 స్టేట్ బ్యాంక్ ద్వారా ఇస్తోంది. ఈ నేపథ్యంలో, రెండు వారాల క్రితం ఆమె సెల్‌ఫోన్‌కు పంపించిన ఎస్ఎంఎస్‌లో... రూ.4,46,21,048 జీఎస్టీ బకాయిలు చెల్లించని కారణంగా జూలై నెల రూ.1,000 నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీనిపై రియాజ్ అహ్మద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇందులో తమాషా ఏంటంటే... రియాజ్ అహ్మద్ ఒక తోళ్ల కంపెనీలో పనిచేస్తూ నెలకు రూ.15,000 వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన భార్య రూ.4.5 కోట్ల జీఎస్టీ చెల్లించాలని బ్యాంక్ అధికారులను కోరడం అటు ప్రజలతో పాటు అధికారులను కూడా దిగ్భ్రాంతికి గురిచేసింది.

తిరునల్వేలి, కోవై మేయర్ ఎన్నిక నిర్వహించండి

● కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు

పెరంబూర్, జూలై 25: తిరునల్వేలి, కోయంబత్తూర్ మేయర్ ఎన్నికలు నిర్వహించాలని తమిళనాడు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. కోయంబత్తూర్ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న డీఎంకేకు చెందిన కల్పన అనారోగ్యం కారణంగా ఈ నెల 3న తన పదవికి రాజీనామా చేశారు. అలాగే, కుటుంబ సమస్యల కారణంగా రాజీనామా చేస్తున్నట్లు తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ పీఎం శరవణన్ ప్రకటించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ రెండు మేయర్ల పదవులకు ఎన్నికల జరిపించాలని, అందుకోసం కార్పొరేషన్ సమావేశాలు ఏర్పాటుచేసి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులుగా ఉన్న ఆ రెండు జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, రాష్ట్రంలో ఇప్పటికే ఖాళీగా ఉన్నట్లు తమకు తెలియజేసిన స్థానిక సంస్థల పదవులకు కూడా ఎన్నికలు నిర్వహించాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొంది.

90 అడుగులు దాటిన మేట్టూరు డ్యాం

పెరంబూర్, జూలై 25: సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం నీటిమట్టం 90 అడుగులు దాటింది. కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కృష్ణరాజసాగర్, కబిని డ్యాం నుంచి అదనపు జలాలను కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. నీరు వస్తుండడంతో మేట్టూరు డ్యాం గురువారం 90.01 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం డ్యాంకు 28,856 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, తాగునీటి అవసరాలకు 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. కాగా, కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేస్తున్న నీటిని 38,000 ఘనపుటడుగుల నీటిని గురువారం సాయంత్రం 65,000 ఘనపుటడుగులకు పెంచారు. నీటి ప్రవాహం కొనసాగితే మరో వారం రోజుల్లో మేట్టూరు డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు చేరుకొనే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

శివకాశి వద్ద పరువు హత్య

చెల్లెలి భర్తను హతమార్చిన సోదరులు


లొంగిపోయిన నిందితులు

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శివకాశి వద్ద వేరే కులస్తుడిని ప్రేమ వివాహం చేసుకుందన్న ఆగ్రహంతో చెల్లెలి భర్తను ఆమె సోదరులు వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హతమార్చారు. ఈ పరువు హత్య కేసులో నిందితులు ముగ్గురూ పోలీసులకు లొంగిపోయారు. శివకాశి జిల్లాలో తీవ్ర సంచలనం కలిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. శివకాశి వెస్ట్ మహాత్మా గాంధీ నగర్ నివసిస్తున్న పొన్నయ్య కుమార్తె నందిని (23), శ్రీవిల్లిపుత్తూరు ఇందిరానగర్‌కు చెందిన మెకానిక్ కార్తిక్ పాండి (25) అనే యువకుడు ఎనిమిదినెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. శివకాశి సమీపం అయ్యంపట్టి గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం చేస్తున్నారు. శివకాశి - శ్రీవిల్లిపుత్తూరు రహదారిలోని కార్తీక్ పాండి మెకానిక్ షాపు నడుపుతున్నాడు. నందిని అదే ప్రాంతంలోని సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో కార్తీక్‌పాండి బుధవారం రాత్రి నందిని కోసం సూపర్‌మార్కెట్‌కు బైకులో వెళ్ళి ఆమె కోసం ఎదురుచూడసాగాడు. ఆ సమయంలో బైకులో వచ్చిన నందిని సోదరులు బాలమురుగన్, ధనపాలన్, వారి స్నేహితుడు శివ కలిసి కార్తీక్‌పాండిని చుట్టుముట్టి వేటకొడవళ్లతో దాడిచేసి పారిపోయారు. ఈ దాడిలో కార్తీక్‌పాండి అక్కడికక్కడే మరణించాడు.

కోవైలో రూ.63 లక్షల బంగారం స్వాధీనం

అడయార్, జూలై 25: కోయంబత్తూరు విమానాశ్రయంలో రూ.63 లక్షల విలువైన బంగారాన్ని రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి కోవైకు వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీ చేయగా, ఆ బ్యాగులో 854 గ్రాముల బంగారం కడ్డీలతో పాటు బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.63 లక్షలుంటుందని తెలిపారు. అయితే, బంగారు ఆభరణాలకు ఎలాంటి పన్ను చెల్లించకుండా తీసుకొచ్చినట్టు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

సీబీసీఐడీ విచారణకు వచ్చిన నిందితులు

అడయార్, జూలై 25: నీలగిరి జిల్లా కోత్తగిరి సమీపంలోని కొడనాడు ప్రాంతంలోని జరిగిన దోపిడీపై నిందితులు విచారణకు హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన ఎస్టేట్‌లో జరిగిన దోపిడీ, సెక్యూరిటీ గార్డు హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దీపు, ఉదయకుమార్ అనే ఇద్దరు నిందితులు గురువారం కోయంబత్తూరులోని సీబీసీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. గతంలో వీరికి జారీ చేసిన సమన్ల మేరకు వీరిద్దరూ ఆఫీసుకు వచ్చారు. వారిని సీబీసీఐడీ ముమ్మరంగా విచారణ జరిపింది. ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసిన విషయం తెల్సిందే.

గాలులకు ఎగిరిన ప్రభుత్వ బస్సు పైకప్పు



పెరంబూర్, జూలై 25: దిండుగల్ జిల్లా పళని సమీపంలో వీచిన గాలులకు ఓ బస్సు పైకప్పు ఎగిరిపోవడంతో, ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. పళని నుంచి కీరనూరుకు బుధవారం సాయంత్రం ప్రయాణికులతో ప్రభుత్వ బస్సు బయల్దేరింది. నరికల్‌పట్టు గ్రామ సమీపంలో బస్సు వస్తున్న సమయంలో హఠాత్తుగా బలమైన గాలులు వీచాయి. వాటి ధాటికి బస్సు పైకప్పు ఎగిరిపోవడంతో ప్రయాణికులు భయంతో కేకలు పెట్టారు. ఈ ఘటనలో ప్రయాణికులెవ్వరూ గాయపడలేదు. వారిని మరో బస్సులో పంపించారు. ఇలాంటి బస్సులు నడిపి ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం మానుకోవాలని సమాజ శ్రేయోభిలాషులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఈ వ్యవహారంపై పళని బస్ డిపో మేనేజర్ జయకుమార్ మాట్లాడుతూ... గాలుల వేగం అధికంగా ఉండడంతో ఈ ఘటన జరిగిందని వివరణ ఇచ్చారు.

మహిళా ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

పెరంబూర్, జూలై 25: తిరుకోవిలూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మహేశ్వరిని సస్పెండ్ చేస్తూ విల్లుపురం డీఐజీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. లైంగిక వేధింపుల కేసులో నిందితుడిని విచారించకుండా లంచం తీసుకున్నారని మహేశ్వరిపై ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో, ఆరోపణలు వాస్తవమని తేలడంతో ఆమెను సస్పెండ్ చేశారు.

నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొండి

● సీఎంకు ఓపీఎస్ సలహా

పెరంబూర్, జూలై 25: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం హితవు పలికారు. ఇటీవల దాఖలుచేసిన కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడు పేరు ప్రస్తావన, నిధులు కేటాయింపు, కొత్త పథకాలు లేవంటూ ప్రధాని నేతృత్వంలో జరుగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, పన్నీర్‌సెల్వం గురువారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల జీవనాధారం పెంపు తదితరాలు దృష్టిలో పెట్టుకొని ప్రధాని నేతృత్వంలో జరిగే సమావేశానికి హాజరై అవసరమైన పథకాలు, నిధులు పొందేలా సీఎం చర్యలు చేపట్టాలే తప్ప, సమావేశాన్ని బహిష్కరిస్తానని చెప్పడం గెలిపించిన ప్రజలకు నష్టం చేకూర్చేలా ఉందని ఓపీఎస్ పేర్కొన్నారు.

'తమిళ్ పుదల్వన్' పథకానికి రూ.401 కోట్లు

పెరంబూర్,జూలై25:'తమిళ్ పుదల్వన్' పథకం ఆగస్టు నుంచి అమలులోకి రానుంది. ఈ పథకానికి రూ.401 కోట్లు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. ఉన్నత విద్య అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నెలకు రూ.1,000విద్యా ప్రోత్సాహకనిధి అందించేలా'తమిళ్ పుదల్వన్ పథకం ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈపథకంలో తొలివిడతగా 32.8 లక్షల విద్యార్థులను ఎంపిక చేయనున్న నేపథ్యంలో,ఆపథకానికి రూ.401కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకంలో లబ్దిపొందే విద్యార్థులు 6 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ఆధార్ కార్డు తప్పనిసరిగా పొంది ఉండాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదవి కళాశాల విద్య చదువుతున్న విద్యార్థినులకు నెలకు రూ.1,000 అందించే 'పుదుమై పెన్' పథకం అమలులో ఉన్న విషయం తెలిసిందే.

అలరించిన అరుణా శ్రీనాథ్ అన్నమయ్య సంకీర్తన కచేరి



కీర్తనలను ఆలాపిస్తున్న అరుణ

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అరుణా శ్రీనాథ్ ఆలపించిన పద కవితా పితామహుడు అన్నమాచార్య కీర్తనలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సంఘం నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ విభావరి 'మహా గణపతిం....' అనే దీక్షితార్ కృతితో గణపతి ప్రార్థనతో ప్రారంభమైంది. అనంతరం 'అంతయు నీవే హరి పుండరీకాక్ష....', 'ఎక్కడి మానుష జన్మంబెత్తిన ఫలమేమున్నది....', 'చెప్పరాని మహిమల శ్రీ దేవుడితడు.....', 'సకల జీవులకెల్ల సంజీవి ఈ మందు...' సహా పలు కీర్తనలను ఆలపించిన అరుణ శ్రీనాథ్ శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమాన్ని సంఘ ప్రెసిడెంట్ ధనుంజయ పర్యవేక్షించారు.




చెన్నైలో పసుమైతాయగం సంస్థ పర్యావరణంపై రూపొందించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వీఐటీ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ కె.విశ్వనాథన్, పీఎంకే నేత అన్బుమణి రాందాస్ తదితరులు



భవానీ నదీ తీరంలో వెలసిన క్షేత్రం

- దుష్టశక్తులను అంతంచేసే అమ్మవారు
- కావలిదేవతలుగా బకాసురుడు, భీముడు

తేక్కంపట్టి వన భద్రకాళి ఆలయం



అమ్మవారి గర్భాలయ గోపురం

పడమటి కనుమల దిగువన, భవానీనదీ తీరంలో అటవీ ప్రాంతంలో తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని, తనను దర్శించేందుకు వచ్చే భక్తుల మొరాలకించి, వారి కోర్కెలను తీర్చే కల్పవల్లిగా తేక్కంపట్టి వన భద్రకాళియమ్మన్ విరాజిల్లుతోంది. చుట్టూ పచ్చదనంతో కూడిన ఈ దివ్యక్షేత్రంలోని అమ్మవారు దుష్టశక్తులను అంతంచేసే మహాశక్తిగా, మహిళలకు కరుణామూర్తిగా, చిన్నారులకు మాతృమూర్తిగా వివిధ రూపాల్లో అనుగ్రహిస్తున్నారు. ఈ అమ్మవారికి భీముడు, అతడి చేత వధింపబడిన బకాసురుడు కావలి దేవతలుగాను, కుంతీదేవి సంతాన భాగ్యాన్నిచ్చే దేవతామూర్తిగా ఉండటం వింతైన విశేషం.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



సర్వాలంకరణ శోభిత వన భద్రకాళికాదేవి



సింహవాహనంపై అమ్మవారు

స్థలపురాణం...

పూర్వం మహిషాసురుడు భోళాశంకరుడైన పరమేశ్వరుడి నుంచి వరాలు పొంది, దేవతలను, రుషులను, సామాన్యులను చిత్రహింసలు పెట్టేవాడు. ఆ మహిషాసురుడిని వధించేందుకు అమ్మవారు పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ కఠోర తపమాచరించింది. ఆ లోకేశ్వరుడిని ఆరాధించిన మీదట అసురుడిని వధించింది. అమ్మవారు పార్వతీపరమేశ్వరులను ధ్యానిస్తూ తపమాచరించిన స్థలంలోనే వన భద్రకాళి ఆలయం ఉంది. చిట్టడవులు చుట్టూ వనంలా ఉండటం వల్లే ఈ క్షేత్రంలో వెలసిన కాళికాదేవిని 'వన భద్రకాళి' అని పిలుస్తున్నారు. ఈ ఆలయానికి ఆరవళ్ళి, శూరవళ్ళి గాథలతో సంబంధం ఉంది. పురుషుల సహవాసం ఇంచుకైనా లేకుండా ఆరవళ్ళి, శూరవల్లి ఇద్దరూ మంత్రాలు, చేతబడి చేస్తూ ప్రజలను వశపరచుకుని వారిని చిత్రహింసలకు గురిచేసేవారు. వారిని అణచివేయడానికి పంచపాండవుల్లో ఒకరైన భీముడు వెళ్లి ఆరవళ్ళి, శూరవళ్ళి మంత్రశక్తుల మధ్య చిక్కుకుంటాడు. దాంతో భీముడిని శ్రీకృష్ణపరమాత్ముడు రక్షిస్తాడు. ఆ ఇద్దరు మంత్రగత్తెలను సంహరించేందుకు పాండవుల బంధువు, కాళికాదేవి భక్తురాలిని శ్రీకృష్ణుడు పురమాయిస్తాడు. ఆమె ఈ క్షేత్రంలోని వనభద్రకాళియమ్మన్‌ను ఆరాధించి, ఆ ఇద్దరు మంత్రగత్తెలను సంహరించినట్లు మరో స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

ఆలయ వైభవం...

ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని పురావస్తు శాఖ అధికారులు చెబుతున్నా, ఖచ్చితంగా ఏ కాలంలో నిర్మించారనే సంగతి గుర్తించలేకపోతున్నారు. ఆలయంలో అమ్మవారు స్వయంభువుగా వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. కొత్త వాహనాలను కొనుగోలు చేసే ఈ ప్రాంతవాసులు ఈ ఆలయం వద్ద వాహనాలకు పూజ చేసిన తరువాతే వాటిని ఉపయోగించడం ఆనవాయితీ. ఈ ఆలయానికి బకాసురుడు, భీముడు కావలి దేవతలుగా ఉండటం అరుదైన ఆశ్చర్యకరమైన విషయం. వీరి రువురి నడుమ కుంతీదేవి ఓ చిన్నబిడ్డతో ఆశీనురాలైన శిల్పం ఉండటం కూడా మరీ విశేషం. ఈ ఆలయానికి 200 మీటర్ల దూరంలో భవానీ నదీ తీరంలో వినాయకుడి ఆలయం ఉంది. ఆ ఆలయం వద్ద భవానీ నది నీటిలో భక్తులంతా తమలపాకుపై కర్పూరం వెలిగించి విడచిపెడుతుంటారు. అక్కడి నుంచి కాస్త దూరం వెళితే నాగదేవత దర్శనమిస్తుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునేవారు, పరిశ్రమలు స్థాపించాలనుకునేవారు, తమ ఇళ్ళలో శుభకార్యాలు చేసేవారు ముందుగా ఈ అమ్మవారి ఎదుట రెండు రంగుల పూలను వేస్తారు. పచ్చ రంగు పూవు చేతికి వస్తే అమ్మవారి అనుమతి లభించినట్లు, ఎరుపు రంగు పూవు వస్తే అమ్మవారి అనుమతి లేదని భావిస్తారు. ఇక వనభద్రకాళి అంటేనే జంతువులను బలివ్వడం ఆనవాయితీ. ప్రతి ఆది, మంగళ, బుధవారాల్లో మేకలను కోళ్లను అమ్మవారి బలి ఇచ్చి పొంగళ్లు పెడతారు. వారానికి సుమారు 300ల నుండి 400 మేకపోతుల వరకు ఈ ఆలయంలో బలులిస్తున్నారు.



కావలి దేవతలుగా బకాసురుడు, మధ్యలో కుంతీదేవి, ఆమె వెనుక భీముడు

ఎలా వెళ్ళాలి?

చెన్నై సహా పలు నగరాల నుంచి కోయంబత్తూరు సమీపం మేట్టుపాళయానికి రాష్ట్ర రవాణాసంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సుల్లో మేట్టుపాళయం చేరుకుంటే, అక్కడి నుంచి 6 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి వెళ్లేందుకు టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీలు కూడా ఉన్నాయి. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. అమావాస్య దినాల్లో వేకువజాము 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

మానసిక రోగులకు విముక్తి...

చేతబడి, మంత్రాలు, మానసిక రోగులు ఇలాంటివారు ఈ ఆలయంలోని కాళికాదేవిని దర్శించుంటే వాటి బారి నుంచి విముక్తి పొందుతారని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. తమ కోర్కెలను నెరవేర్చే ఈ అమ్మవారికి వివాహితులు తమ తాళిబొట్టును హుండీలో వేయటం ఆనవాయితీ. ఈ ఆలయానికి వచ్చే భక్తులంతా నగదు, బంగారు, వెండి వస్తువులను హుండీలో వేస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం కూడా చేస్తున్నారు. ఈ ఆలయంలో నిమ్మపండు దీపం వెలిగిస్తే తలచిన కార్యాలు నెరవేరుతాయని చెబుతుంటారు.

ఆడిగుండం వేడుకలు...

ఈ ఆలయంలో ప్రతియేటా ఆడి(తమిళ ఆషాఢ మాసం)గుండ ప్రవేశ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. అమ్మవారి అనుమతి పొంది ఆడి మొదటి మంగళవారం అగ్ని కలశాలు, రెండో మంగళవారం పూల కలశాలు, మూడో మంగళవారం మరుపూజలు నిర్వహిస్తారు. ఈ వేడుకల సందర్భంగా 36 అడుగుల పొడవైన అగ్ని గుండాన్ని ఏర్పాటు చేసి, భక్తులు నియమనిష్ఠలతో వ్రతమాచరించి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. ఈ వేడుకలలో సుమారు రెండు లక్షలమంది భక్తులు పాల్గొంటారు. దీపావళి, సంక్రాంతి, తమిళ ఉగాది దినాల్లోనూ ఈ ఆలయాన్ని లక్షలాదిమంది దర్శిస్తుంటారు.



పుష్పాలంకరణతో అగ్ని గుండం

దేశంలో తొలిసారి
360 డిగ్రీల వేదికపై యువన్ సంగీత విభావరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యువన్ శంకర్ రాజా తదితరులు

ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా సంగీత విభావరి ఈ నెల 27వ తేదీ నందనంలోని వైఎంసీఏ మైదానంలో జరుగనుంది. నాయిస్ అండ్ గ్రెయిన్స్, బూమర్ ఫ్యాషన్ సంయుక్తంగా నిర్వహించే ఈ లైవ్ కాన్సర్ట్ కోసం దేశంలోనే తొలిసారి 360 డిగ్రీల వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఇదే విషయంపై నగరంలో జరిగిన మీడియా సమావేశంలో నాయిస్ అండ్ గ్రెయిన్స్ డైరెక్టర్లు మహావీర్, కార్తీక్ శ్రీనివాస్, బూమర్ ఫ్యాషన్ నిర్వాహకులు లింగుస్వామి, హరితతో కలిసి యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ, 'చెన్నై నగరంలో నిర్వహించే ఈ షో నాకు ఎంతో ప్రత్యేకమైనది. గతంలో జరిగిన ఒక షోలో తనకు, అభిమానులకు మధ్య బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఇది అభిమానులు దూరంగా ఉన్నామనే ఫీలింగ్ కలిగింది. అభిమానులకు చాలా దగ్గరగా ఉంటూ సంగీత విభావరిని నిర్వహించాలన్న భావన నాలో ఏర్పడింది. నా అభీష్టానికి అనుగుణంగా ఈ రెండు సంస్థలు కలిసి 360 డిగ్రీల వేదిక ఏర్పాటు చేసి, అక్కడ ఈ మ్యూజిక్ లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ఇది అభిమానులకు ఖచ్చితంగా కొత్త అనుభవాన్ని ఇస్తుంది. ఈ కచేరిలో అభిమానులతో కలిసి మ్యూజికల్ నైట్ నిర్వహించే అవకాశం లభించింది. ఈ నెల 27వ తేదీ వైఎంసీఏ మైదానంలో కలుసుకుందాం. 'యు1 లాంగ్ డ్రైవ్ లైవ్ ఇన్ కాన్సర్ట్' పేరుతో నిర్వహించే ఈ సంగీత విభావరిలో తనతో పాటు ఆండ్రియా, హరిచరణ్, ప్రేమ్ జీ అమరన్, రాహుల్ నంబియార్, హరిప్రియ, దివాకర్ రిషా, ఆదిత్య, శ్రీ నిషా, ఎంసీ సన వంటి గాయనీగాయకులు గానంచేస్తారు. అని పేర్కొన్నారు. లింగుస్వామి మాట్లాడుతూ, 'చెన్నై తర్వాత కోయంబత్తూరు, సింగపూర్‌లో ఇదే తరహా సంగీత విభావరిలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, వీటికి సంబంధించి అధికారికంగా తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

అగరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 12వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు వెళ్తున్న 'ఫస్ట్ జనరేషన్' విద్యార్థినీ విద్యార్థులను సన్మానించిన హీరోలు సూర్య, కార్తీ. చిత్రంలో సీనియర్ నటుడు శివకుమార్ తదితరులు



శంకర్ దృష్టికి మా సినిమా

- 'మిన్మిని' దర్శకురాలు హలీదా షమీమ్

చిన్నారుల ఇతివృత్తంతో తాను రూపొందించిన 'మిన్మిని' చిత్రం ప్రముఖ దర్శకుడు శంకర్ దృష్టికి కూడా వెళ్ళిందని దర్శకురాలు హలీదా షమీమ్ వెల్లడించారు. ఇందులో గౌరవ్ కాళై, ప్రవీణ్ కిషోర్, ఎస్తర్ అనిల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించగా, ఖతీజా రెహ్మాన్ సంగీతం అందించారు. వచ్చే నెలలో విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకురాలు హలీదా షమీమ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా చిన్నపిల్లతో తీశాను. ఈ పాత్రలకు సంబంధించి రెండో పోర్షన్ వారితోనే తీయాలన్న పట్టుదలతో వారు పెరిగి పెద్దవారయ్యేంత వరకు వేచివుండి సినిమా పూర్తి చేశాను. ఈ విషయం దర్శకుడు శంకర్ దృష్టికి కూడా వెళ్ళింది. అనేక మంది ఆశ్చర్యంగా ఆరా తీశారు. నిజం చెప్పాలంటే సినిమా షూటింగ్ ప్రారంభించేటపుడు కూడా ఇంతలా వెయిట్ చేయలేదు. కానీ, చిన్న పాత్రల్లో నటించిన వారే పెద్దయ్యాక కూడా నటించాలన్న ఉద్దేశంతో ఎదురు చూశాం. అలాంటి సినిమాకు పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. సంగీత దర్శకురాలు ఖతీజా రెహ్మాన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం 2022లో దర్శకురాలు సంప్రదించారు. నా సంగీతం ఆమెకు నచ్చింది. అదేసమయంలో ఆమెకు ఏం కావాలన్న అంశంలో ఎంతో క్లారిటీగా ఉంటారు. హలీదాతో కలిసి పనిచేసినందుకు ధన్యవాదాలు' తెలిపారు. నటుడు గౌవర్ కాళై మాట్లాడుతూ, 'హలీదాతో కలిసి పనిచేయడం వల్ల అనేక విషయాలు నేర్చుకున్నాను. ఇతర నటీనటులు కూడా ఎంతో శ్రద్ధతో నటించారు' అని తెలిపారు.



'మిన్మిని' ఆడియో రిలీజ్ దృశ్యం

షేన్ నిగమ్ - నిహారిక జంటగా 'మద్రాస్‌కారన్'

చిత్రజ్యోతి

మాలీవుడ్ నటుడు షేన్ నిగమ్, టాలీవుడ్ నటి నిహారిక, కోలీవుడ్ నటుడు కలైయరసన్ ప్రధాన పాత్రలు పోషించిన 'మద్రాస్‌కారన్' చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక బుధవారం రాత్రి నగరంలో జరిగింది. ఎస్ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై బి.జగదీష్ నిర్మాణంలో 'రంగోలి' చిత్ర ఫేం వాలి మోహన్ దాస్ దర్శకత్వంలో వైవిధ్యభరితమైన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీగా రూపొందించారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రారంభించడానికి ప్రధాన కారణం నిర్మాత జగదీష్, నటి ఐశ్వర్య దత్తా. వీరిద్దరికీ ధన్యవాదాలు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. నటి నిహారిక మాట్లాడుతూ, 'టీజర్ ప్రతి ఒక్కరికీ నచ్చిందనుకుంటున్నాను. పలువురు ప్రతిభావంతులు కలిసి ఈ ప్రాజెక్టు కోసం పనిచేసి,ఒక మంచి సినిమా రూపొందించాం. షేన్ నిగమ్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు వాలికి ధన్యవాదాలు' తెలిపారు. నటుడు కలైయరసన్ మాట్లాడుతూ, 'నా సొంతూరు మద్రాస్. కానీ, ఇందులో పుదుక్కోట వాసిగా నటించాను. షేన్ నిగమ్ మంచి నటుడు. వాలి మేకింగ్ బాగా నచ్చింది. చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేదు. మంచి కథ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. ఆ కోవకు చెందింది' అని పేర్కొన్నారు. షేన్ నిగమ్ మాట్లాడుతూ, 'నా మీద నాకే సందేహం ఉన్న సమయంలో వాలీ, జగదీష్ ఎంతో నమ్మకంతో ఈ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసిన ఎస్‌టీఆర్‌కు ధన్యవాదాలు' అన్నారు.



నిహారిక, కలైయరసన్, షేన్ నిగమ్

వనిత కుమారుడు శ్రీహరి హీరోగా ప్రభుసాల్మన్ దర్శకత్వంలో 'మాంబో'



ఖాజామొహిదీన్, విజయ్ శ్రీహరి, విజయకుమార్, ప్రభుసాల్మన్

సీనియర్ నటుడు విజయకుమార్ ఫ్యామిలీ నుంచి మూడోతరం వారసుడు కోలీవుడ్ ఇండస్ట్రీలో హీరోగా పరిచయమవుతున్నారు. పేరు విజయ్ శ్రీహరి. ప్రముఖ దర్శకుడు ప్రభుసాల్మన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మాంబో' చిత్రంలో అతడు హీరోగా నటిస్తున్నారు. వెటరన్ నిర్మాత ఎం.ఖాజామొహిదీన్ రోజా కంబైన్స్ పతాకంపై చాలా గ్యాప్ తర్వాత ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ వెల్లడి, హీరో పరిచయ కార్యక్రమం గురువారం నగరంలో జరిగింది. ఇందులో చిత్ర పరిశ్రమ నుంచి నిర్మాతలు టి.శివ, డి.ధనంజయన్ వంటి అనేక మంది ప్రముఖులు హాజరై యువ నటుడిని అభినందించారు. అలాగే, సుదీర్ఘ కాలం తర్వాత మళ్ళీ సినిమాలు తీసేందుకు వచ్చిన నిర్మాత ఖాజామొహిదీన్‌ను ఇతర నిర్మాతలు ప్రత్యేకంగా అభినందించారు. దర్శకుడు మాట్లాడుతూ, 'షూటింగ్ శరవేగంగా జరుపుకునే ఈ సినిమాను 'జర్నీ ఆఫ్ ఏ వైల్డ్ ఫ్రెండ్‌షిప్'గా రూపొందిస్తున్నాం. ఇందుకోసం రియల్ సింహంతో హీరో ట్రైనింగ్ తీసుకుని సన్నివేశాల్లో నటిస్తున్నారని వివరించారు. కాగా, విజయకుమార్ ఫ్యామిలీ నుంచి ఆయన కుమారుడు అరుణ్ విజయ్ హీరోగా రాణిస్తున్నారు. ఇపుడు మూడోతరం వారసుడిగా, వనిత - ఆకాష్‌ల సంతానమైన విజయ్ శ్రీహరి... విదేశాల్లో నటన, దర్శకత్వం, ప్రొడక్షన్ విభాగాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసి స్వదేశానికి వచ్చి... నటనపై దృష్టిసారించి, తన తొలి చిత్రంలోనే ప్రభుసాల్మన్ దర్శకత్వంలో నటించడం గమనార్హం.

మూడు వేల ఏళ్ల అనంతరం
తీర్థపు బావి ప్రారంభం

భగవతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



మూడు వేల ఏళ్లనాటి తీర్థపు బావిని పరిశీలిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, జూలై 25: ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో మూడు వేల ఏళ్ల క్రితం పరశురాముడు ప్రతిష్ఠించిన పురాతన భగవతి అమ్మవారి ఆలయం. ఈ ఆలయ ప్రాంగణంలో ఉత్తర దిశగా పుణ్య తీర్థ బావి ఉన్నది. ఈ బావి సముద్రానికి 50 అడుగుల దూరంలో ఉన్నప్పటికీ, నీరు తాగడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ తీర్థబావి నుంచే ఆలయ పూజారులు ప్రతిరోజు అమ్మవారి అభిషేకానికి అవసరమైన పుణ్యజలాలు తోడుతుంటారు. మూలస్థానానికి ముందున్న దీప మండపం నుంచి భూమి లోన సొరంగమార్గం గుండా ఈ బావిలో దిగి అభిషేకానికి అవసరమైన నీటిని తెస్తుంటారు. చీకటిగా ఉండే ప్రాంతంలో ఉన్న ఈ బావిలో తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు బంగారు చెంబులో తోడే నీటితో అమ్మవారి అభిషేకాలు చేస్తారు. అంతేకాకుండా, ప్రతిరోజు ఉదయం నివేదించే నైవేద్యంలో పెసరపప్పు పొంగలి, చక్కెర పొంగలి, అటుకుల పాయసం, పాల పాయసం తదితరాలను తయారుచేసేందుకు ఈ బావి నీటినే వాడుతుంటారు. ఈ ఆలయంలో నిర్వహించే కుంభాభిషేక, వర్షాభిషేకం, వేసవి ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు ఈ బావి నీటినే ఉపయోగించడం ఆనవాయితి. ఈ నేపథ్యంలో, ఈ పురాతన బావిని సంరక్షించేవారు లేక చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా తయారవడంతో బావి పై భాగాన్ని మూసివేశారు. అయినప్పటికీ, ఆలయానికి వచ్చే భక్తులు మూసిన బావిలో నగదు, వెండి నాణేలు, ఇతర కానుకలను వేస్తున్నారు. ముఖ్యంగా, రామేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లే ఉత్తర రాష్ట్రాల భక్తులు కన్నియాకుమారి త్రివేణి సంగమం, భగవతి అమ్మవారి ఆలయ తీర్థకొలనులో నగదు కానుకలు అధికంగా చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆలయాన్ని పరిశీలించిన కన్నిమాకుమారి జిల్లా ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మెన్ ప్రభా రామకృష్ణన్, బావిలో భక్తులు కానుకగా చెల్లించిన నగదు, నగలు తదితరాలు లెక్కించాలని, బావిలోకి వెళ్లే సొరంగ మార్గంలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు గురువారం ఉదయం భగవతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పురాతన తీర్థబావిని తెరిచారు.

కూడన్‌కుళం విద్యుత్ రాష్ట్రానికే కేటాయించాలి

- డీఎంకే ఎంపీ విల్సన్



పెరంబూర్, జూలై 25: కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రంలో 3,4 యూనిట్లలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను 100 శాతం తమిళనాడుకే కేటాయించాలని రాజ్యసభలో డీఎంకే ఎంపీ విల్సన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమిళనాడు ఇంధన భద్రత ప్రాజెక్టులపై పార్లమెంటు సమావేశా ల్లో గురువారం ఎంపీ విల్సన్ మాట్లాడుతూ... విద్యుత్‌కోతలు లేని రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందన్నారు. ప్రస్తుతం రామనాథపురంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రం, ఉడనకుడిలో 3,960 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్ల నిర్మాణపనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 2025-26 నాటికి రాష్ట్ర విద్యుత్ అవసరాలు 21,000 మెగావాట్లకు చేరుకొనే అవకాశముందని, కొత్త విద్యుత్ ప్రాజెక్టులు పూర్తికావాలంటే మరికొంత పట్టే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో, కూడన్‌కుళంలో అణువిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న 1,2 యూనిట్ల ద్వారా లభించే 2,000 మెగావాట్లలో తమిళనాడుకు 1,150 మెగావాట్లు మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. 2025లోగా ఈ కేంద్రంలో 3,4 యూనిట్లు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్న నేపథ్యంలో, ఈ కొత్త యూనిట్లలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను 100 శాతం రాష్ట్రానికే కేటాయించాలని ఎంపీ విల్సన్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి శతకోటి గాయత్రి మంత్రజప
మహా పూర్ణాహుతి మహోత్సవం



గాయత్రి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న పోరూరి శ్రీనివాసరావు

ప్యారీస్, జూలై 25: ఈ నెల 27 నుంచి 31వ తేది వరకు అయోధ్యలో శతకోటి గాయత్రి మహా మంత్ర జప మహా పూర్ణాహుతి మహోత్సవం జరుగుతుందని సంధ్యా వందన అభ్యాసన శిక్షణ సమితి చెన్నై విభాగం కో-ఆర్డినేటర్ పోరూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక విల్లివాక్కంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మహోత్సవం బ్రోచర్, గాయత్రి అమ్మవారి చిత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీ రామచంద్రమూర్తి సారథ్యంలో అయోధ్యలో ఐదు రోజులు సాగనున్న మహోత్సవంలో శ్రీ రామ పట్టాభిషేకం, సీతారాముల కల్యాణం, నగర సంకీర్తనం, సరయు నదీ స్నానం, రామాయణ పారాయణం, సామూహిక కుంకుమార్చన, సత్యనారాయణ వ్రతం ఇత్యాధి కార్యక్రమాలను విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించనున్నట్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన జపకులు ఈ ఉత్సవానికి తరలి వస్తారని ఆయన తెలిపారు.

చురుకుగా హెక్సావేర్ డ్రీమ్ రన్నర్స్ హాఫ్ మారథాన్

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బిసెంట్‌నగర్ వద్ద గురువారం ఉదయం హెక్సావేర్ డ్రీమ్ రన్నర్స్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ చురుకుగా సాగింది. ఈ మారథాన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ డీసీపీ బండి గంగాధర్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి.లత జెండా ఊపి ప్రారంభించారు. ఈ మారథాన్‌లో తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సుమారు 5500 మది పాల్గొన్నారు.



మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం